జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 29-11-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 178 పేజీలు: 8 వెల : రూ.7


# ఏసీబీ సోదాలతో.. వణుకు





*** బెంబేలెత్తిపోతున్న పలువురు అధికారులు, సిబ్బంది * అక్రమాస్తులు, ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న వారిపై నిఘా * పూర్తి వివరాలతో గుట్టుచప్పుడు కాకుండా ఏకకాలంలో దాడులు * కృష్ణదాస్ మాజీ పీఏ మురళీ ఇంటిలో ఏసీబీ అధికారుల తనిఖీలు * బంధువుల ఇళ్లల్లో కూడా సోదాలు**

**శ్రీకాకుళం క్రైం, నవంబర్ 28 (వార్త):** ఏసీబీ అధికారుల వరుస సోదాలతో పలువురు అధికారులు, సిబ్బంది హడలిపోతున్నారు. ఏరోజు ఎవరి మీద దాడులు జరుగుతుందోనని జిల్లాకు చెందిన పలువురు ఆందోళన చెందుతున్నారు. అక్రమాస్తులు, ఆదాయానికి మించి ఆస్తులున్న ఉన్నవారిపై ఏసీబీ అధికారులు నిఘా పెట్టి పూర్తి వివరాలతో దాడులకు దిగుతున్నారు. ఆదాయానికి మించి ఆస్తులున్న అధికారి, సిబ్బందితో పాటు వారి కుటుంబీకుల ఇళ్లకు వెళ్లి మొత్తం వివరాలు సేకరిస్తున్నారు. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) జోన్-2 కమిషనర్ పొందూరు సింహాచలం ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండడంతో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ సింహాచలం బంధువుల ఇళ్లల్లో కూడా మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. కమిషనర్ స్వగ్రామమైన ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటలో సింహాచలం తల్లిదండ్రుల ఇళ్లతో పాటు కింతలిలోని అత్తవారింట్లో, కొత్తపేటలోని వియ్యంకుడి ఇంట్లో కూడా సోదాలు చేశారు. శ్రీకాకుళం జిల్లాలో 13 ఇళ్ల స్థలాలు, కింతలిలో 4.6 ఎకరాల వ్యవసాయభూమి, ఒక కారు, 500 గ్రాములు బంగారం, ఆరు బ్యాంకు అకౌంట్లలో రూ.ఐదు లక్షలు నగదు ఉన్నట్టు గుర్తించారు.

## కృష్ణదాస్ మాజీ పీఏ మురళీ నివాసాల్లోనూ సోదాలు

డిప్యూటీ మాజీ సీఎం ధర్మాన కృష్ణదాస్ మాజీ పీఏ మురళి నివాసాల్లోనూ ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణదాస్ వద్ద ప్రభుత్వ పీఏగా మురళి పనిచేశారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో అధికారులు సోదాలు చేపట్టారు. కోటబొమ్మాళి మండలం దంత గ్రామంతో పాటు, లింగంనాయుడిపేటలోని ఆయన నివాసాల్లో తనిఖీలు చేశారు. మురళి పనిచేస్తున్న బుడితి సీహెచ్‌సీలో పలు పత్రాలు పరిశీలించారు. విశాఖపట్నంలోని ఆటోనగర్‌లో కూడా సోదాలు చేశారు. మురళీ స్వగ్రామమమైన జలుమూరు మండలం లింగన్నాయుడుపేటలోని ఇంట్లో ఏసీబీ సీఐ శ్రీనివాసరావు, మురళీ పనిచేస్తున్న సారవకోట మండలం బుడితి సీహెచ్‌సీలో కూడా సీఐ సుప్రియ నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. కోటబొమ్మాళి మండలం దంత గ్రామంలో మూడు ఇళ్లు, మధురవాడలో ఫ్లాట్, గాజువాకలో ఇల్లు, కోటబొమ్మాళిలో ఓ ఇల్లు, శ్రీకాకుళం జిల్లాలో నాలుగు హౌస్ ఫ్లాట్స్, విశాఖ జిల్లా పెందుర్తిలో ఒక ఇంటి ఫ్లాట్, విజయనగరం జిల్లా భోగాపురంలో ఇంటి ఫ్లాట్, శ్రీకాకుళంలో ఓ ఇల్లు ఉన్నట్టు గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాలో 15ఎకరాల 47 సెంట్ల వ్యవసాయ భూమి, 6ఎకరాల 5 సెంట్ల మెట్ట భూమి, ఇంటిలో 520 గ్రాముల బంగారు ఆభరణాలు, బ్యాంకు లాకర్‌లో 536 గ్రాముల బంగారు ఆభరణాలు, ఇంటిలో 11కిలోల 36 గ్రాముల వెండి వస్తువులు, బ్యాంకు ఖాతాలో రూ. 43,223, ఒక కారు, ఒక బుల్లెట్ మోటార్ సైకిల్ ఉన్నట్లు ఏసీబీ తనిఖీలో వెల్లడైంది. ఈ ఆస్తులన్నీ అతని పేరుతోనూ, అతని బంధువుల పేరుతోనూ కూడబెట్టుకున్నట్లుగా ఏసీబీ అధికారులు నిర్ధారించారు. అలాగే డిఫెన్స్‌కు చెందిన 5 లిక్కర్ బాటిళ్లు, ఒడిశా రాష్ట్రానికి చెందిన మరో ఐదు లిక్కరు బాటిళ్లు తనిఖీలో లభించాయి. దీంతో కోటబొమ్మాళి ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్రమాస్తులను కూడబెట్టుకున్న వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగి మురళీని అదుపులోకి తీసుకుని విశాఖలోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.



*** మైదాన, అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్న పెద్దపులి**
*** పెద్దకేశనాయుడుపేటలో ఆవుపై దాడి**
*** పాదముద్రలను బట్టి పులిగా గుర్తింపు**
*** భయాందోళనలో ప్రజలు**
*** అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అటవీ అధికారుల సూచన**



# అమ్మో.. పులి

**సంతబొమ్మాళి, నవంబర్ 28 (వార్త):** మందస మండలంలోని సాబకోట పంచాయతీలోని బుడంబో, బొందికరితో పాటు భావనాపురం గిరిజన గ్రామాల్లో మంగళవారం పెద్దపులి సంచరించగా, గురువారం సంతబొమ్మాళి మండలంలోని హనుమంతు నాయుడుపేట పంచాయతీ పెద్దకేశనాయుడుపేట గ్రామంలో కనిపించిందని స్థానికులు చెబుతున్నారు. పెద్దకేశవనాయుడుపేట గ్రామానికి చెందిన భద్రాచలం శాంతమూర్తికి చెందిన ఆవును మెడను కొరికేసినట్టు వారు గుర్తించారు. వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అటవీశాఖ అధికారులు, స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జంతువు యొక్క పాద ముద్రలను గుర్తించి 14 ఇంచుల పొడవు ఉన్నట్టు గుర్తించి వివరాలు నమోదు చేశారు. పొడవు ముద్రలు బట్టి పెద్దపులిని పోలి ఉండడంతో మగపులి అయి ఉంటుందని అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అప్రమత్తంగా ఉండాలని పరిసర ప్రాంత ప్రజలను కోరారు. తహసీల్దార్ ఆర్ రమేష్ కుమార్‌కు సమాచారం అందించారు. పరిసర ప్రాంత గ్రామాల్లో దండోరా వేయించడంతో పాటు ప్రజలను అప్రమత్తం గా ఉండాలని నరసన్నపేట ఫారెస్ట్ రేంజర్ జి.జగదీశ్వర్, నౌపడ ఎస్ఐ నారాయణస్వామి, ఏసిఎఫ్ ఏవి నాగేంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జనప్రియ, ఎఫ్ ఎస్ ఓ నరేంద్ర, వెటర్నరీ డాక్టర్ అప్పలసూరి సూచించారు.

## మంత్రి ఆదేశాలతో గ్రామాల్లో చాటింపు..

సంతబొమ్మాళి మండలంలో పులి సంచారం సమాచారం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అటవీ శాఖాధికారులతో మాట్లాడారు. పెద్ద పులి ఆనవాళ్లు గుర్తించామని, ఒరిస్సా నుంచి ఇది వచ్చివుంటుందని అటవీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నిర్మానుష్య ప్రదేశాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, గ్రామాల్లో చాటింపు వేయించడంతో పాటు కరపత్రాలు ద్వారా తెలియజేయాలని మంత్రి అచ్చెన్న అటవీ అధికారులను ఆదేశించారు.



## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, నవంబర్29 (వార్త):** అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజులు పాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయనే అంచనాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టరేట్‌తో పాటు ప్రతీ మండల కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టరేట్ కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 08942-240557 ఏర్పాటు చేసినట్లు అలాగే డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు సిద్ధం చేసినట్లు వివరించారు. రైతులు ధాన్యాన్ని జాగ్రత్త పరచుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్‌ను లేదా సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సొండిపూడి విద్యార్థుల ప్రతిభ



**మందస, నవంబర్ 28(వార్త):** మందస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. కౌశల్ ఆన్‌లైన్ క్విజ్ రాష్ట్రవ్యాప్త పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు తలగాన దేవ రాజు, మద్దిల చరణ్, మద్ది శ్రీజ, 10వ తరగతి విద్యార్థులు బాడ శ్రీజ, భాగ్యలక్ష్మిపాణిగ్రాహి, డొక్కరి మాధవి విజేతలుగా నిలిచారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు సుందర్ సాల్మన్, ఎస్.అప్పారావు, ఎన్.కరుణాకర్, ఎస్.నారాయణరావు, పి.చంద్రశేఖర్, కె.వెంకటరమణ, ఆర్.చంటిబాబు, ఎస్.విజయ్, వై.తులసీదాస్, బి.జోత్స్న, ఎం.ఇందిర తదితరులు అభినందించారు.

# నేడే చలో శ్రీకాకుళం

**■ విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపు**



**శ్రీకాకుళం, నవంబర్ 28(వార్త):** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శ్రీకాకుళంలో శుక్రవారం నిర్వహిస్తున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు పిలుపునిచ్చారు. జిల్లాలోని మాలలు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. శ్రీకాకుళంలోని ఎన్‌జీవో హోంలో గురువారం వారు విలేఖరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని అభిప్రాయపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం ఎస్సీలను వర్గీకరించేందుకు ప్రభుత్వాలు ఉత్సాహాన్ని చూపిస్తున్నాయని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మేధావులు గొంతెత్తుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణతో మాలలకి అన్యాయం జరుగుతుందన్నారు. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి పాతబస్టాండ్, కిన్నెర జంక్షన్, జడ్పీ జంక్షన్, సంతోషిమాత కోవెల జంక్షన్ మీదుగా ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద గల డచ్ బిల్డింగ్ వరకూ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీ అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభలో దళిత మేధావులతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు , కార్మికులు, మహిళలు, యువకులు పాల్గొంటారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ తర్వాతనే డీఎస్సీ జరుపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, అలా చేస్తే మాలలు తీవ్రంగా నష్టపోతారన్నారు. డీఎస్సీ నియామకాలు తక్షణం పూర్తి చేయాలని కోరారు. మాలలను ఎన్‌డీఏ ప్రభుత్వం మోసం చేస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో కల్లేపల్లి రాంగోపాల్, తైక్వాండో శ్రీను, కంఠ వేణు, రాయి వేణుగోపాల్, సాకేటి నాగరాజు, సింకు రమణ, దేబారిక రాజు, పెయ్యల చంటి, అబ్బాస్, పంకు మురళి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితుడికి రూ.46వేల సాయం



**పాతపట్నం, నవంబర్ 28(వార్త):** సీతారామపల్లి గ్రామానికి చెందిన బాలుడు నీలాపు చందు ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కుడిచేతిని కోల్పోయాడు. ఆయన సహాయార్థం టీడీపీ నేత తామర గ్రామానికి చెందిన జావ్వాది ఈశ్వరరావు రూ.46వేలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ద్వారా బాలుడు తల్లికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. బాలుడి విద్యాభ్యాసానికి తనవంతు సాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

## 15మందిపై బైండోవర్



**మందస, నవంబర్ 28(వార్త):** సారాను అరికట్టే చర్యల్లో భాగంగా మందస మండలంలో 15 మందిని బైండోవర్ చేసినట్టు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు. వివిధ కేసుల్లో అరెస్టయిన వీరిని మండల మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మండలంలోని బెల్లం వ్యాపారులకు నోటీసులు ఇచ్చామని, సారా తయారు చేసే వారికి ముడిబెల్లం విక్రయించరాదని తెలిపామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 200 సారా ప్యాకెట్లును సీజ్ చేశామని, వీటిని అమ్ముతున్న సంబంధిత వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



**పలాస, నవంబర్ 28(వార్త):** లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్డీవో జి.వెంకటేష్ అన్నారు. పలాస ఆర్డీవో కార్యాలయం నందు సబ్ డిస్ట్రిక్ట్ మల్టీ లెవెల్ అప్రోవేటెడ్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి స్కానింగ్ సెంటర్లు నడపాలని సూచించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ తాడేల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి స్కానింగ్ సెంటర్‌కు వచ్చే ప్రతి గర్భిణి పేరును విధిగా నమోదు చేయాలన్నారు. ఆ వివరాలను జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి వారికి పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సూర్యకళ, డీఈఎంవో వెంకటేశ్వర్లు, డీపీఎంవో వాన సురేష్, పలాస ఏపీఎన్జీవో అధ్యక్షుడు బోనెల గోపాల్, ప్రముఖ వైద్యులు మల్లేశ్వరరావు, విజయకుమార్, దంతం భీమారావు, మంజుల, గాయత్రి, మౌనిక, శృతి, న్యాయవాది ఉషారాణి, ఆర్డీవో ఆఫీస్ సిబ్బంది, ఎన్జీవో సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## వస్త్ర దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం



**పలాస, నవంబర్ 28(వార్త):** పలాస మున్సిపాలిటీ పరిధి కేటీ రోడ్డులో ఉన్న ఓ వస్త్ర దుకాణంలో గురువారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో చాలావరకు వస్త్రాలు అగ్నికి అహుతయ్యాయి. ఈ ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని స్థానికులు భావిస్తున్నారు.

## మత్స్య ఉత్పత్తిదారుల సమైక్య ఏర్పాటుచేయాలి

**ఇచ్ఛాపురం, నవంబర్ 28(వార్త):** మత్స్య సహకార సంఘాలను రైతు ఉత్పత్తిదారుల సమైక్యగా ఏర్పాటు చేయాలని జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పీవీ శ్రీనివాసరావు, పలాస మత్స్యశాఖ సహాయ సంచాలకులు వై.సత్యనారాయణ సూచించారు.సొసైటీ అధ్యక్షులు ఎ.కృష్ణచంద్ర బెహరా ఆధ్వర్యంలో కంద్రవీధిలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఇచ్ఛాపురం మండల మత్స్యశాఖ అధికారి కె.రవికుమార్, రాష్ట్ర పరిశీలకులు చిట్టినాయుడు, ఫీల్డ్‌మాన్ డి.బాలాజీ, మత్స్యశాఖ సహాయకులు అబ్దుల్ ముబీన్, సాగరమిత్ర పీవీ రమణ, రాజేంద్ర బెహరా పాల్గొన్నారు.



# ఆవు పాల సేకరణ ధర పెంచాలి



**మందస, నవంబర్ 28(వార్త):** ఆవు పాల సేకరణ ధరను పెంచాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 2న విశాఖ డెయిరీ కేంద్ర కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు, జీడి రైతు సంఘం కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ కోరారు. మట్ట ధర్మారావు అధ్యక్షతన మందస సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల సేకరణ ధర లీటర్‌కు రూ.3నుంచి రూ.4ల వరకు తగ్గించారని, దీంతో పాల రైతులు రోజుకు రూ.20 లక్షలు నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే రైతుకి పాలు ధర గిట్టుబాటు కావడం లేదని, పశువుల దాణా, వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. యాజమాన్యం ఉన్న ధర తగ్గించి వేయడం అన్యాయమన్నారు. డెయిరీ అభివృద్ధిలో వచ్చిన మిగులు రైతులకు దక్కకుండా దారి మళ్లిస్తూ భారాలు మాత్రం వేస్తు న్నారన్నారు. డెయిరీ అవినీతిపై విచా రణ జరిపి దోషులను శిక్షించాలని, పక్క రాష్ట్రాలు పాల రైతులకు ప్రోత్సా హకంగా ఇస్తున్నట్టు లీటర్‌కు 5 రూపా యలు మన ప్రభుత్వం కూడా చెల్లించా లని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఎం.గణపతి, గుర్నాథ్, భావన్న పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఉచితంగా బ్యూటీషియన్ శిక్షణ.. దరఖాస్తుల ఆహ్వానం

**పలాస, నవంబర్ 28(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్ సెంటర్లలో ఉపాధి శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా పలాస నియోజకవర్గ హబ్ పరిధిలో డాక్టర్ వి.కణితీస్. ప్రభుత్వ ఐటీఐ నందు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్‌కోర్స్‌ను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పైల జవహర్, జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హత కలిగి 18-35 ఏళ్ల లోపు వయసున్న స్త్రీలు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించనున్నారు. ఆసక్తి గల మహిళలు తమ సర్టిఫికెట్స్, ఆధార్ ఫొటో స్టాట్ కాపీలు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం హబ్ కోఆర్డినేటర్ ఆర్.సోమేశ్వరరావు సెల్ నెంబర్ 6301046329కు సంప్రదించాలని సూచించారు.



## అపార్ పెండింగ్ విద్యార్థుల వివరాల సేకరణ

**నరసన్నపేట,నవంబర్ 28(వార్త):** నరసన్నపేటలోని శర్వాణి ప్రైవేట్ స్కూల్‌లో గురువారం సమగ్ర శిక్షా సీఆర్ఎంటీలు పొట్టన్న, శ్రీనివాసరావు అపార్ పెండింగ్ విద్యార్థుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరితగతిన విద్యార్థుల అపార్ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రవీంద్ర భారతి ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన బోధన అందించండి



**జలుమూరు, నవంబర్ 28(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఎంఈవో బమ్మిడి మాధవరావు తెలిపారు. గురువారం ఆయన సురవరం ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభ్యాసన ఎలా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో రైమ్స్ కూడా చెప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యాసన మెరుగుపడే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్



**జలుమూరు, నవంబర్ 28(వార్త):** పెద్దదూగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశామని ఉపాధ్యాయులు సింహాచలం తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఈ స్టడీ మెటీరియల్ వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బాలికల గురుకుల కళాశాల పరిశీలన

**నరసన్నపేట, నవంబర్ 28(వార్త):** తామరాపల్లి గురుకుల బాలికల కళాశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి యు.శాంతారావు సందర్శించారు. కళాశాలలో విద్యార్థుల పెండింగ్ అపార్ త్వరితగతిన పూర్తి చేయాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. ఆధార్‌లో పుట్టినతేదీ, పేర్లను సరి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భూ సమస్యలు తక్షణం పరిష్కరించాలి



**వంగర, నవంబర్ 28(వార్త):** రైతులకు ఇబ్బంది లేకుండా భూ సమస్యలు తక్షణం పరిష్కరించాలని చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి సిబ్బందికి ఆదేశించారు. గురువారం ఆమె వంగర తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన 847 భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని కోరారు. అనంతరం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ వంగర మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు పూర్తయినట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం వంగరలోని రైస్ మిల్లును పరిశీలించారు. గన్నీ బ్యాగులు మండలానికి 44 వేలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ బ్యాగులు కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఉన్నాయన్నారు. ధాన్యం తరలించడానికి వాహనాలు ప్రభుత్వం సమకూర్చినట్లు తెలిపారు.

ధాన్యం తీసుకొన్న 48 గంటల్లో (సొమ్ము)నిధులు జమ చేస్తామన్నారు. ప్రతిరోజూ తహసీల్దార్,వ్యవసాయ అధికారి సమీక్షించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండలంలో నీటి తీరువా బకాయిలు రూ.2.44 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు భూమి శిస్తు వసూలు వేగవంతం చేయాలని తహసీల్దార్ ధర్మరాజు, వీఆర్‌వోలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్‌వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌పై ఎంపీపీ ఫిర్యాదు

తహసీల్దార్ ధర్మరాజుపై ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ.. ఆర్డీవో సత్యవాణికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆయన ప్రజలకు సకాలంలో పనులు చేయట్లేదని, ప్రజాప్రతినిధులను చిన్న చూపు చూస్తున్నారని ఆమెకు వివరించినట్లు సమాచారం.

నిబంధనలకు విరు ద్ధంగా పనులు చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

# రాష్ట్రీయ బాల స్వాస్థ విజయవంతం



**పోలాకి, నవంబర్ 28(వార్త):** పోలాకి మండలంలో రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని వైద్యాధికారి డా.శ్రీనాథ్ అన్నారు.

గురువారం జిల్లా ఉన్నతాధి కారుల బృందం పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి వివిధ అంశాల మీద ఆరాతీసింది.

జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట్, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ అప్పలనాయుడు, డేటాఎంట్రీ ఆపరేటర్ సంతోష్, ఎన్సీ డీసీడీ కోఆర్డినేటర్, మండల విద్యాశాఖ అధికారి అప్పారావు, వైద్యాధికారి డా.సుమప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి డా.నల్లి రవికుమార్, ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమక్షంలో ప్రత్యేక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల శారీరక కొలతలు తీసుకున్నారు. వీరికి వివిధ వైద్య పరీక్షలు జరిపారు. అనంతరం పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, సిబ్బంది పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిక్షణతో ఉపాధ్యాయుల ప్రాణాలు బలి



**వంగర, నవంబర్ 28(వార్త):** గజపతినగరం బాలాజీ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆకస్మిక మృతికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పెంకి గౌరీశంకరరావు మాట్లాడుతూ శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను వారం రోజుల పాటు కుటుంబాలకు దూరంగా, వసతులు లేని ప్రదేశాల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం సరికాదన్నారు. ఈ రెసిడెన్షియల్ శిక్షణతో ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని, ఆ శిక్షణను రద్దు చేయాలని కోరారు. మరణించిన ఉపాధ్యాయునికి కోటి రూపాయల నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఆయన మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఫ్ మండల ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్, మండల కార్యదర్శి పి.చంద్రమౌళి, ప్రతినిధులు వి.సతీష్, బి.చంద్రమౌళి, పి.మురళి, ఎస్.రాంబాబు, వి.శ్రీనివాసరావు, జేబీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బోధనా నైపుణ్యాలను పరిశీలించిన సీఆర్ఎంటీ



**నరసన్నపేట, నవంబర్ 28 (వార్త):** నరసన్నపేట పట్టణ పరిధిలోని తమ్మయ్య పేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సమగ్ర శిక్ష సీఆర్ఎంటీ ఎన్.పొట్టన్న బోధనా నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ అంశాలను టీచ్ టూల్ యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అప్రమత్తంగా ఉండాలి





**జలుమూరు, నవంబర్ 28(వార్త):** తుఫాన్ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.రామారావు రైతులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని పలు పంచాయతీల్లో పర్యటించి రైతులను అప్రమత్తం చేశారు. చాలా ప్రాంతాల్లో రైతులు గోనెసంచులతోనూ, రోడ్లపై ధాన్యాన్ని నిల్వచేసి ఉండడాన్ని గుర్తించారు. రైతులందరూ తాము పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

**పోలాకి:** వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ప్రియాగ్రహారం రెవెన్యూ అధికారి కార్తీక్ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రియాగ్రహారం, రామయ్యవలస గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. పొలాలను పరిశీలించారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు వరి కోతలు కోసిన రైతులు తగు ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని సూచించారు. ఆయన వెంట రైతు ఆదినారాయణ, రెవెన్యూ సహాయకులు అసిరయ్య ఉన్నారు.

**నరసన్నపేట:** తుఫాన్‌తో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని తహసీల్దార్ టి.సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణారావు సూచించారు.

గురువారం వారు మాకివలస పంచాయతీలో రైతులతో మాట్లాడారు. బయట ఉన్న ధాన్యాన్ని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. పొలాల్లో ఉన్న వరిచేలను కుప్పలుగా ఉంచి భద్రపరుచుకోవాలన్నారు.

తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. గురువారం సాయంత్రం నరసన్నపేట వ్యవసాయ శాఖ అధికారిణి సునీత రావులవలస పంచాయతీలో పర్యటించి రైతులకు వివిధ సూచనలు చేశారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



**సారవకోట, నవంబర్ 28 (వార్త):** కుమ్మరిగుంట జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కుమ్మరి గుంటకు చెందిన కలివరపు తిరుమలరావు బుధవారం రాత్రి బహిర్భూమికి రోడ్డు దాటుతుండగా, నరసన్నపేట నుంచి ద్విచక్ర వాహనంపై మాలువ వెళ్తున్న నక్క రామరాజు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తిరుమలరావుకు కాలు విరిగిపోగా రామరాజుకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకుని, వారిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

## అక్రమ మద్యం అమ్ముతున్న ఏడుగురిపై కేసు



**నరసన్నపేట, నవంబర్ 28 (వార్త):** అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న వారిపై బైండోవర్ కేసులు పెట్టామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం నరసన్నపేట ఎక్సైజ్ సీఐ ఎస్వీఆర్ మూర్తి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న ఏడుగురుపై కేసులు నమోదు చేయగా, బైండోవర్ చేశామన్నారు. మరోసారి అక్రమంగా మద్యం అమ్మితే లక్ష రూపాయలు జరిమానా తప్పదని హెచ్చరించారు.

## విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**వంగర, నవంబర్ 28(వార్త):** వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా వివిధ పరీక్షలు నిర్వహించినట్లు మెడికల్ సిబ్బంది విశాలాక్షి తెలిపారు. ఈ సందర్భంగా వంగర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దాడ రమణమ్మ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త సత్యవతి, మరియమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

**వంగర, నవంబర్ 28(వార్త):** టీడీప సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావునాయుడు అన్నారు. గురువారం ఆయన వంగరలో జరిగిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. మండలంలో అన్ని గ్రామాల్లో కూడా సభ్యత్వ కార్యక్రమం త్వరగా చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.



# పూలేకు ఘన నివాళులు



**ఇచ్ఛాపురం, నవంబర్ 28(వార్త):** పూలే వర్ధంతి సందర్భంగా శాంతికేతన్ స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు శంకర్, శ్రీధర్, పద్మజ, శాంతి మహాపాత్ర, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ పి.తేజస్, సెక్రటరీ మోహన్‌ప్రియ, వైస్ ప్రెసిడెంట్ జి.హారిక, జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, ఎస్‌పీఎల్ జోత్స్న పాల్గొన్నారు.

**జలుమూరు:** అంటరానితనం నిర్మూలనకు ఎంతో కృషి చేసిన పూలే సేవలు ఎనలేనివని ప్రధానోపాధ్యాయులు ఇప్పటి వేణుగోపాలరావు, మెండ రామారావు అన్నారు. జలుమూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పూలే సేవలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పలాసలో అలరించిన క్రీడా పోటీలు



**పలాస, నవంబర్ 28(వార్త):** పలాస క్రీడా మైదానంలో గురువారం జరిగిన మండల స్థాయి గ్రిగ్స్ క్వాలిఫైయింగ్ పోటీలు అలరించాయి. సీనియర్ బాలుర విభాగంలో కబడ్డీ క్రీడలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాశీబుగ్గ శ్రీచైతన్య, బాలికల విభాగంలో ఖోఖోలో ఎంజేపీ పలాస, చిన్నబడాం, జూనియర్ విభాగంలో బాలుర కబడ్డీలో బొడ్డపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పలాస అర్హత సాధించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.దాశ రథి, కౌన్సిలర్ ప్రతినిధి జె.మల్లేశ్వర రావు విద్యా కమిటీ చైర్మన్ కె.తాతయ్య వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిట య్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాస రావు, సీహెచ్.పద్మలోచన, వైకే హరి నాథ్, ఎస్.రామారావు, టి.గణేష్, సీహెచ్ రాంజీ, డి.సంతోష్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పెట్రోకెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన



**సంతబొమ్మాళి, నవంబర్ 28 (వార్త):** మండలంలోని తీరప్రాంతంలో పెట్రోకెమికల్స్ పరిశ్రమ ఏర్పాటు అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. హల్దియా పెట్రోలియం కోర్పొరేషన్ అధ్వర్యంలో మండలంలో పెట్రోకెమికల్స్ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మూలపేట, ఈస్ట్ కోస్ట్ పవర్ ప్లాంట్ భూములు, మేఘవరం తంపర భూములు పరిశీలించారు. రెవెన్యూ అధికారులు భూముల వివరాలను సంస్థలకు మ్యాప్‌ల ద్వారా వివరించారు. ఈ పర్యటనలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఏపిఐఐసి అధికారులు, రాష్ట్ర మారిటం బోర్డు అధికారులు ఉన్నారు.

# వసతి గృహాల్లో మరమ్మతులు ఉంటే తెలియజేయండి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




**శ్రీకాకుళం, నవంబర్ 28(వార్త):** వసతి గృహాల్లో చిన్న చిన్న మరమ్మతులు ఉంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్స్, ఫీజు రీఎంబార్స్ మెంట్, భోజన ఖర్చులు, వసతి గృహాల్లో సమస్యలు, తదితర వాటిపై ఆయన సమీక్షించారు. వసతి గృహాల్లో ఉన్న సమస్యలను వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. మందస ఆశ్రమ పాఠశాలలో సీట్లు ఖాళీగా ఉండడం పై కలెక్టర్ ఆరా తీశారు. వసతి భవనం చాలడం లేదని వార్డెన్ చెప్పగా కొత్త భవనానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మందసలో బిసి హాస్టల్‌కు ప్రభుత్వ భవనం ఉందని అందులో తక్కువ మంది విద్యార్థులు ఉన్నారని, గిరిజన ఆశ్రమ పాఠశాల భవనంలో ఉన్న విద్యార్థులను వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి భవనంలోకి మార్చి ఇరు విద్యార్థులను ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలపాలని బిసి సంక్షేమ అధికారి అనూరాధ చెప్పగా అలా కలపొచ్చని ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇతర కులాలు ఉండొచ్చా లేదా అడుగగా ఉండొచ్చని ఎటిడబ్ల్యూఓ చెప్పారు. నాడు-నేడులో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎటిడబ్ల్యూఓ చెప్పారు. ఆ నిధులతో కొన్ని మరమ్మతులు చేపట్టినట్లు ఎటిడబ్ల్యూఓ కలెక్టర్ కు వివరించారు. హాస్టల్స్‌లో ఉన్న ఒక్కో విద్యార్థికి ఎంత వస్తుందని కలెక్టర్ అడుగగా 1600 వందల రూపాయలు వస్తుందని, ఆ నిధులతో ఏం పెడుతున్నారని అడుగగా విద్యార్థులకు పెట్టే మెనూపై వివరించారు. కమాటీ, కుక్కు, వాచ్ మన్ 203 రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఎటిడబ్ల్యూఓ చెప్పారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ మాట్లాడుతూ ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కూల్స్ పై కలెక్టర్ కు వివరించారు. ప్రభుత్వ వసతి గృహాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రతిపాదనలు చూస్తానని కలెక్టర్ తెలిపారు. అవసరం ఉన్న చోట తుఫాను కేంద్రాలను వినియోగించవచ్చని హాస్టల్స్ లేదా స్కూల్స్‌కు వాడుతారో అవసరానికి అనుగుణంగా వాడాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి వసతి భవనాలు మరమ్మతులకు జిల్లా కలెక్టర్ నిధులు నుండి పది లక్షల రూపాయలు మంజూరు చేశారని, మరమ్మతులు చేపట్టడమైనదని డిడి వివరించారు. హాస్టల్ వద్ద సైకిల్ షెడ్ కావాలని డిడి చెప్పగా అక్కడిక్కడే మంజూరు చేశారు. వసతి గృహాల్లో మరమ్మతులపై వార్డెన్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా చిన్న చిన్న మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అంతకంటే ఎక్కువ నిధులు అవసరం అనుకుంటే ప్రతిపాదనలు డిడికి పంపాలని తెలిపారు. ఓఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఔట్ సోర్సింగ్ పై పోస్టులు నియామకానికి అనుమతి కావాలని బిసి సంక్షేమ అధికారి చెప్పగా లెటర్ పంపాలని ఆయన తెలిపారు. హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ లో ఉన్న సమస్యలను వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. స్కూల్స్‌లలో ఫీజులు చెల్లించలేదని పరీక్ష హాల్ టిక్కెట్లు జారీ చేయని స్కూల్స్‌పై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సెప్టిక్ ట్యాంక్ ఫుల్ అయి బయటకు లీకేజీలు ఉన్నాయని వార్డెన్లు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా డిపిఓతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో వెనుకబడి తరగతుల సంక్షేమ అధికారిణి అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, సహాయ సంక్షేమ అధికారులు, వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఆమదాలవలసలో రోడ్డు ప్రమాదం

### బస్సు ఢీకొని ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

**ఆమదాలవలస, నవంబర్ 28 (వార్త):** ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డ్ తిమ్మాపురం కూడలి వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం నుండి పాలకొండ అతి వేగంగా వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న ఊయక నాని (31) అక్కకక్కడే మృతి చెందగా, వాహనం నడుపుతున్న బుచ్చల కూర్మినాయుడు(38) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆమదాలవలస పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో వారిని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వీరిద్దరూ వీరఘట్టం మండలం, గిరడ గోపాలపురం గ్రామానికి చెందిన వారని పోలీసులు వివరించారు. బస్సును, డ్రైవరును అదుపులోకి తీసుకొని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

* ఎమ్మెల్యే కూన రవికుమార్
* ఉప్పినివలసలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**బూర్జ(ఆమదాలవలస), నవంబర్ 28 (వార్త):** కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటుందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం ఆమదాలవలస నియోజకవర్గంలో బూర్జ మండలం లో ఉప్పినవలస సచివాలయం పరిధిలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో పంటలు బాగా పండడంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి ఒక్క రైతు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వ ప్రసాద్, ఏపీ మార్కుఫెడ్ స్టేట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.




## మహాత్మా జ్యోతిరావు పూలేకు నివాళి



**శ్రీకాకుళం,నవంబర్ 28(వార్త):** మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. మహాత్మా జ్యోతీరావు పూలే చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, కెఆర్ఆర్సీ ఉప కలెక్టర్ పద్మావతి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, సహాయ సంక్షేమ అధికారులు, వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు. జ్యోతీరావు పూలే వర్ధంతి సందర్భంగా జ్యోతీరావు పూలే పార్క్ లో ఉన్న జ్యోతీరావు పూలే విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్యోతీరావు పూలే బడుగు బలహీన వర్గాల వారి హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయులన్నారు. విద్య, సామాజిక సంస్కరణలు, ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి అనూరాధ, బిసి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రెండు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ప్రారంభం

**శ్రీకాకుళం, నవంబర్ 28(వార్త):** శ్రీకాకుళం బస్ స్టేషన్ ఆవరణలో రెండు కొత్త ఎక్స్ ప్రెస్ బస్సులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 2వ డిపో మేనేజర్, కె. ఆర్. యస్. శర్మ, సూపర్ వైజర్స్ వెదుళ్ల రమేష్, గంగరాజు, చాణక్య, ఉమామహేశ్వర రావు, ధర్మారావు, శిమ్మయ్య, ఆచారి, రమేష్, ఓ.పి.ఆర్.యస్. సూపర్ వైజర్, భాషా, ఆర్.సి.జి. శ్రీనివాస్, యూనియన్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

**శ్రీకాకుళం, నవంబర్ 28(వార్త):** వ్యవసాయ విధానాలలో క్లైమేట్ రెసిలియంట్‌కు ప్రత్యామ్నాయంగా ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలబడిన ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న కార్యకర్తలను బలోపేతం చేసుకునే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ - రైతు సాధికార సంస్థ - ఏపీసీఎన్ఎఫ్ ద్వారా రాష్ట్రంలో పని చేస్తున్న క్షేత్ర కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రేవతి, అదనపు ప్రాజెక్ట్ మేనేజర్ ధనుంజయ రావు శిక్షణ ఇచ్చారు. రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం నుండి శ్రీరామ్ కుమార్ శ్రీకాకుళం జిల్లా శిక్షణా ఇంచార్జి పర్యవేక్షించారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు అందరి సహకారం అవసరం

**శ్రీకాకుళం లీగల్, నవంబర్ 28(వార్త):** బాల్య వివాహాల నిర్మూలనకు అందరి సహకార అవసరమని జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ, కార్యదర్శి, ఆర్.సన్యాసి నాయుడు తెలిపారు. గురువారం జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో సన్యాసి నాయుడు మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత దేశంగా తీర్చిదిద్దాలని కోరారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి శాంతిశ్రీ, బ్రేడ్స్ సంస్థ సింహాచలం, జిల్లా బాలల హక్కుల పరిరక్షణా వేదిక అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, మాట్లాడుతూ బాల్య వివాహలు అరికట్టేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు వివరిస్తూ పూర్తి స్థాయి అమలుకు పలు సూచనలు అందజేశారు. ఈ అవగాహనా కార్యక్రమంలో జి. ఇందిరా ప్రసాద్, బాలల సంరక్షణ కమిటీ మెంబర్ ఎం.గనేష్పుడు పలువురు న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది తదితరులు హాజరైయారు.

## బాల్య వివాహ బాలిక చదువుకు ఎన్ఈఆర్ అండ

**శ్రీకాకుళం, నవంబర్ 28(వార్త):** బాల్య వివాహాన్ని రద్దు చేసుకొని ఎంతో కష్టపడి చదువుకొని ప్రస్తుతం సాఫ్ట్ వేర్ రంగంలో ఉపాధి పొందుతూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్న శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేటకు చెందిన బచ్చు రమణమ్మ సివిల్స్ కోచింగ్‌కు సంబంధించి ఆర్థిక సహాయాన్ని అందించడానికి ఎన్ఈఆర్ స్కూల్ వ్యవస్థాపకులు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వర రావు ముందుకువచ్చారు. దీంతో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పూడ్కర్ జిల్లా అధికారులతో కలిసి అభినందనలు తెలిపారు. ఎచ్చెర్ల నియోజక వర్గానికి చెందిన ఒక నిరుపేద విద్యార్థికి ఉన్నత చదువులకు ప్రోత్సహించే అవకాశం దొరకడం తమకు అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు.

## అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య

**పాతపట్నం,నవంబర్ 28(వార్త):** అప్పుల బాధను తాళలేక పాతపట్నం మేజర్ పంచాయతీకి చెందిన ఆళ్ల శ్రీను గురువారం ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీలో అలసత్వంవద్దు

**జలుమూరు, నవంబర్ 28 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు చౌకు డిపో దుకాణాల ద్వారా అందజేస్తున్న నిత్యావసర సరుకులు పంపిణీలో అలసత్వం వహించవద్దని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సూర్య ప్రకాష్ రావు తెలిపారు. గురువారం సాయంత్రం నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డిపో డీలర్లు తో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్క వినియోగదారుడికి అందించవలసిన సరుకులను సక్రమంగా అందజేయాలన్నారు. తహశీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## నేటి నుంచి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై సర్వే

**శ్రీకాకుళం,నవంబర్28(వార్త):** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై శుక్రవారం నుంచి సర్వే ప్రారంభమవుతుందని జిల్లా పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు జె.ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలపై వచ్చే ఏడాది ఫిబ్రవరి ఒకటి వరకు ఈ సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ సర్వే కోసం ఎం.ఎస్. ఎం.ఈ సర్వే, సపోర్ట్ అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించడమైనదని, గ్రామ, వార్డ్ సచివాలయాల ఉద్యోగులు ఈ సర్వే నిర్వహించుచున్నట్లు స్పష్టం చేశారు. ఈ సర్వే వల్ల వివిధ రకాల ప్రోత్సాహకాలు పొందేందుకు అన్ని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అర్హత లభిస్తుందన్నారు.

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Working Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546